క్లుప్తంగా

నాంది ఫౌండేషన్ వితరణ



బ్యాగ్, పుస్తకాలు అందిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

అగనంపూడి: బాలికల్లో సృజనాత్మక శక్తిని పెంపొందించేందుకు నాంది ఫౌండేషన్ చూపుతున్న చొరవ అభినందనీయమని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి యలమంచిలి చిన అప్పారావు అన్నారు. 85వ వార్డు దానబోయిన పాలెం పాఠశాల విద్యార్థులకు నాంది ఫౌండేషన్ బ్యాగ్‌లు, నోట్ పుస్తకాలు, పెన్నులు, డ్రాయింగ్ పుస్తకాలు, రెయిన్‌కోట్లు, పౌచ్‌లు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎం.శ్రీలేఖ, స్థానిక నాయకులు వరలక్ష్మి, వరహా వెంకటరావు, లావణ్య, లలిత, భారతి తదితరులు పాల్గొన్నారు.

న్యూపోర్టు పీఎస్‌ను సందర్శించిన డీసీపీ-2



పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీసీపీ-2 సత్యనారాయణ

పెదగంట్యాడ: శాంతి భద్రతలకు విఘాతం కలిగించేవారు ఎంతటి వారైనా ఉపేక్షించవద్దని డీసీపీ-2 ఎం.సత్యనారాయణ ఆదేశించారు. న్యూపోర్టు పోలీస్ స్టేషన్‌ను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలు తెలుసుకున్నారు. విధి నిర్వహణలో ఎవరూ నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని, పోలీసు స్టేషన్‌కు వచ్చేవారితో స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను పాటించాలన్నారు. ఈ విషయంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదన్నారు.


భక్తాంజనేయ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి



స్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: స్థానిక బీసీ రోడ్డులోని ఆలయంలో కొలువుదీరిన భక్తాంజనేయస్వామిని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి శనివారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు కన్నేపల్లి సీతాపతిశర్మ ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు.

శ్యామా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



గోపూజ చేస్తున్న భక్తులు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీ దేవి ఆరాధనా పీఠంలో శ్యామా నవరాత్రి ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా గోపూజతో వేడుకలకు శ్రీకారం చుట్టారు. అనంతరం శ్రీయంత్ర మహామేరు మొదటి అంతస్తుకు ఉత్సవ మూర్తులను మేళతాళాలతో తోడ్కొని వెళ్లి, బ్రహ్మపీఠంపై ఆరోహణం చేశారు. పవిత్ర జలాలతో కలశ స్థాపన చేసిన అనంతరం రాజశ్యామల అమ్మవారికి చతుష్షష్ఠి ఉపచారాలను విధానపూర్వకంగా అర్పించారు. సుగంధాది తీర్థజలాలు, క్షీర, పంచామృత ద్రవ్యాలతో అభిషేకించి నూతన వస్త్రాభరణాలను అమ్మవారికి అలంకరించారు. సాయంత్రం అమ్మవారి సన్నిధిలో లఘు శ్యామవహనం నిర్వహించారు. కార్యక్రమంలో కెనడా నుంచి వచ్చిన డల్లాస్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి వెంకట రమణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఒడితో నిశ్చింత

విద్యార్థుల ఉన్నత చదువులకు భరోసా

నవశకం – సంక్షేమ సంతకం



నడుపూరు జెడ్పీ హైస్కూల్‌లో అమ్మ ఒడి నగదు చెక్కును విడుదల చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి (ఫైల్)

గాజువాక: పేదరికంతో ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకూడదనే సత్సంకల్పంతో విద్యారంగంలో ఎన్నో సంస్కరణలకు శ్రీకారం చుట్టారు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి. అందులో భాగంగా అమలు చేస్తున్న అమ్మ ఒడి పథకం మాతృమూర్తులకు ఎంతో అండగా నిలుస్తోంది. ప్రతీ విద్యార్థి పాఠశాలకు వెళ్లాలని, తల్లులు తమ పిల్లలను బడి మాన్పించకుండా పంపించాలని భావించిన ఆయన పిల్లలను పాఠశాలలకు పంపించే తల్లులకు ప్రతీ ఏడాది రూ.15వేలు అమ్మ ఒడి పథకం ద్వారా అందిస్తున్నారు. నవరత్నాల్లో భాగంగా అందిస్తున్న ఈ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల తల్లుల బ్యాంక్ ఖాతాల్లోకి నేరుగా డబ్బు జమ చేస్తూ వారికి భరోసా కల్పిస్తోంది.

పేద కుటుంబాల్లోని పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి ఈ పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. ఈ పథకం కింద ప్రభుత్వం లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో ప్రతీ ఏడాది రూ.15 వేలు చొప్పున జమ చేస్తోంది. ఒక్క గాజువాక నియోజకవర్గంలోనే నాలుగు విడతల్లో రూ. 280.52 కోట్లను జమ చేసింది. ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుకుంటున్న విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ఈ డబ్బులు జమ అయ్యాయి. తెల్లరేషన్ కార్డు కలిగి ఉండి ప్రభుత్వ, లేదా ప్రైవేట్ పాఠశాలల్లో చదివించే పిల్లలకు అమ్మ ఒడి పథకాన్ని అమలు చేస్తున్నారు.

బడి వయసు పిల్లలు డ్రాపవుట్స్‌గా మారకుండా వారి చదువును ప్రోత్సహించాలన్న మహోన్నత లక్ష్యంతో ఈ పథకాన్ని ప్రారంభించారు. దీనిని పటిష్టంగా అమలు చేసేందుకు ప్రభుత్వం గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, తల్లిదండ్రుల కమిటీ, ఉపాధ్యాయులకు బాధ్యతలను అప్పగించింది. విద్యార్థి పాఠశాలకు రాని పక్షంలో వెంటనే తల్లిదండ్రులకు తెలిసేలా చర్యలు చేపట్టింది. గైర్హాజరైన మొదటి, రెండో రోజు తల్లిదండ్రుల మొబైల్‌కు సమాచారం వస్తుంది. మూడో రోజు కూడా గైర్హాజరైతే గ్రామ వలంటీర్ విద్యార్థి ఇంటికి వెళ్లి వివరాలను తెలుసుకుంటున్నారు. దీంతో అమ్మ ఒడి శతశాతం సత్ఫలితాన్ని అందిస్తోంది.

జగనన్న అమ్మ ఒడి లబ్ధిదారులు

సంవత్సరం	లబ్ధిదారులు	నగదు పంపిణీ
2019-20	27,676	రూ. 59,78,40,860
2020-21	38,220	రూ. 78,84,26,480
2021-22	37,349	రూ. 78,44,44,294
2022-23	36,646	రూ. 63,45,73,357
నాలుగు విడతల్లో లబ్ధిదారులకు అందజేసిన నగదు		రూ. 280,52,84,991

మా పాప చక్కగా చదువుకుంటోంది



మాది ఆర్థికంగా వెనుకబడిన కుటుంబం. నా భర్త మాంసం దుకాణంలో పని చేస్తారు. అక్కడ వచ్చే ఆదాయంతో కుటుంబం గడవడమే కష్టంగా ఉంటోంది. మా పాప ప్రభుత్వ పాఠశాలలో చదువుతుంది. జగనన్న అధికారంలోకి వచ్చాక పాఠశాలల స్వరూపమే మారిపోయింది. కార్పొరేట్ స్కూల్ తరహాలో వసతులె కల్పించారు. బోధన బాగుంది. ఏడాది మొదట్లోనే విద్యాకానుక అందడంతో పుస్తకాలు, యూనిఫామ్‌కు బెంగ లేదు. అమ్మ ఒడి పథకం ద్వారా నా అకౌంట్‌లో ప్రతీ సంవత్సరం రూ.15వేలు జమ అవుతోంది. దీంతో మా పాప చక్కగా చదువుకుటోంది. –ఎస్.కె.నూర్జహాన్, గాజువాక

ఈ సౌకర్యాలను ఊహించలేదు



నా భర్త గాజువాకలోనే కలాసీగా పని చేస్తున్నారు. వచ్చే ఆదాయం అంతంత మాత్రమే. మా పాప గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏడో తరగతి చదువుతోంది. జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక పాఠశాలలను చాలా బాగా అభివృద్ధి చేశారు. విద్యార్థులకు మంచి సౌకర్యాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. నా అకౌంట్‌లో ప్రతీ సంవత్సరం రూ.15వేలు జమ చేస్తున్నారు. ఈ సౌకర్యాలను అస్సలు ఊహించలేదు. జగనన్నకు రుణపడి ఉంటాం.

– ఇ.దేవి, గాజువాక

పిల్లలను దర్జాగా చదివిస్తున్నాం.



మా అబ్బాయి శ్రీనివాస్ ఇస్లాంపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. ఇంటి ల్లిపాదీ పని చేస్తే గానీ పూట గడవని బతుకులు మావి. ఈ పరిస్థితుల్లో నా కుమారుడిని చదివించుకోవడం ఎలా అనే సందిగ్ధంలో ఉన్న మమ్మల్ని అమ్మ ఒడి పథకం ఆదుకుంది. ఇప్పుడు దర్జాగా నా కొడుకును చదివిస్తున్నాను. నాలుగేళ్లుగా అమ్మఒడి నగదు అందుతోంది. నా కుమారుడు భవిష్యత్తుకు భరోసా కల్పిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. సీఎం అందిస్తున్న పథకాలతో మా జీవితాల్లో మార్పులు వచ్చాయి. పేదల కోసం పని చేస్తున్న ఆయనకు ధన్యవాదాలు

– కె అరుణ, కె.ఎస్.పాలెం, పెదగంట్యాడ

అమ్మ ఒడితో చదువుల తల్లి ఒడికి..



జగనన్న ప్రవేశ పెట్టిన అమ్మ ఒడి పథకం మా బిడ్డ చదువుకు ఎంతో తోడ్పాటును అందించింది. నా భర్త దువ్వాడ వీఎస్ఈజెడ్‌లోని ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నారు. మా పాప పేరు హేమ ప్రియ. తనను మంచి చదువులు చదివించాలని ఆశ. అమ్మ ఒడి పథకం మా ఆశలకు జీవం పోసింది. మా పాపను 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ప్రైవేటు విద్యాసంస్థల్లో చదివించే స్థితి కల్పించింది. ఇప్పుడు తను కార్పొరేట్ కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతోంది. నాలుగేళ్లలో రూ.56వేలు మా ఖాతాలో వేశారు. ఆ డబ్బుతో గుర్తింపు ఉన్న కళాశాలలో చదివిస్తున్నాం. జగనన్న చేసిన సహాయం ఎప్పటికీ మర్చిపోలేం.

–మేడిశెట్టి లక్ష్మి, అగనంపూడి

ఉన్నత చదువులకు భరోసా వచ్చింది



మా అబ్బాయి జోగిసాయి కణితి హైస్కూల్లో 8వ తరగతి చదువుతున్నాడు. తనను ఉన్నత చదువులు చదివించాలని నా కోరిక. కానీ మా కుటుంబానికి అంత ఆర్థిక స్తోమత లేదు. ఆ సమయంలో జగనన్న దేవుడిలా ఆదుకున్నారు. ముఖ్యమంత్రిగా అధికారంలోకి రావడంతోనే పిల్లల చదువుల కోసం ఎన్నో చర్యలు తీసుకున్నారు. స్కూళ్లన్నీ చక్కగా తయారు చేశారు. ఇప్పుడు మాలాంటి ఎన్నో కుటుంబాలు పిల్లలను ఎలాంటి బెంగా లేకుండా చదివించుకోగలుగుతున్నాయి అంటే జగనన్న దయే. అమ్మ ఒడి పథకం ద్వారా నాలుగేళ్లనుంచి నేరుగా మా ఖాతాల్లోనే నగదు జమ చేయడంతో పాటు నా కొడుకు చదువుకు కావాల్సిన అన్ని సదుపాయాలను అందిస్తున్నారు. జగనన్న కల్పిస్తున్న ఆర్థిక భరోసాతో మా అబ్బాయిని ఉన్నత చదువులు చదివించుకోగలననే భరోసా కలిగింది.

– సబ్బవరపు నాగలక్ష్మి, కణితి కాలనీ

యువతకు ఉపాధి కల్పతరువు స్టీల్‌ప్లాంట్



దీక్షలో పాల్గొన్న అగనంపూడి సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు

కూర్మన్నపాలెం: విశాఖ స్టీల్‌ప్లాంట్ భావితరాల యువతకు ఉపాధి కల్పించే కల్పవృక్షం వంటిదని అగనంపూడి సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు అన్నారు. అటువంటి ప్లాంట్‌ను ప్రభుత్వరంగ సంస్థగానే నడపాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారానికి 1094వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో అగనంపూడి సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షులు జి.బోసుబాబు, సభ్యులు, స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగులు, పలువురు కార్మికులు పాల్గొన్నారు. దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వరంగ సంస్థలను అమ్ముకుంటూ పోతే భారతదేశంలో ఏ ప్రభుత్వరంగ సంస్థా మిగలదన్నారు. భావితరాలకు మంచి భవిష్యత్తును అందించేందుకు స్టీల్‌ప్లాంట్ వంటి సంస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ నాయకులు ఆదినారాయణ, ఎస్.రామారావు, జె.అయోధ్యరామ్, బలిరెడ్డి సత్యనారాయణ, అసోసియేషన్ ప్రతినిధులు ఎస్.ఎం.రఫీ, భాస్కరరాజు, గుడే సుశీల గజేంద్రరావు, మరిసా రామచంద్రరావు, విందుల వరహాలు, సీహెచ్ నారాయణరావు, సాయిన సన్యాసిరావు, బి.ఎస్.రాజు, మస్తాన్‌రెడ్డి, కాళిదాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ, ఉద్యోగ అవకాశాలు

అక్కిరెడ్డిపాలెం: హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్, బొల్లినేని మెడ్ స్కిల్స్ సంయుక్తంగా బ్యూటీషియన్, ఫుడ్ అండ్ బెవరేజ్ సర్వీస్ అసోసియేట్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్.నాగేశ్వరరావు శనివారం తెలిపారు. ఈ కోర్సుల్లో చేరేందుకు పదో తరగతి/ఇంటర్ పూర్తి చేసిన 18 నుంచి 28 ఏళ్ల లోపు వయసు గల పురుషులు, మహిళలు అర్హులని తెలియజేశారు. మూడు నెలల శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి గలవారు 91219 99624, 79930 11605 నంబర్లను సంప్రదించి, పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు విశాఖపట్నం ద్వారకానగర్‌లోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో హెచ్‌పీసీఎల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో సంప్రదించాలని తెలియజేశారు.

సనాతన ధర్మాన్ని వారసత్వంగా అందించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సప్తరుషి ఆశ్రమ వ్యవస్థాపకుడు మాధవశర్మ

సబ్బవరం: సనాతన ధర్మాన్ని, వేదాల సారాన్ని దేశంలోని యువతకు వారసత్వంగా అందించాలని సప్తరుషి ఆశ్రమం, వేద పాఠశాల వ్యవస్థాపకులు మావుళ్లపల్లి మాధవశర్మ కోరారు. సప్తరుషి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని గొల్లలపాలెం గ్రామంలో శనివారం నిర్వహించిన వేద భారత పరిక్రమ యాత్ర విజయోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విశ్వవ్యాప్తంగా ప్రతీ ఒక్కరికీ జగద్గురు ఆది శంకరాచార్యులు ఆదర్శనీయమని, ఆయనను స్ఫూర్తిగా తీసుకుని యువత ముందుకు సాగాలన్నారు. శంకరులు 32 సంవత్సరాల వయసులోనే భారతావనిని నాలుగు సార్లు చుట్టివచ్చి, సనాతన ధర్మాన్ని కాపాడటంతో పాటు ధర్మ సంస్థాపనార్థం నాలుగు దిక్కుల్లో నాలుగు పీఠాలను స్థాపించారన్నారు. ఆయన సందేశాన్ని, వేదాల సారాంశాన్ని విశ్వ వ్యాప్తం చేసి, ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక భావాలను అలవరచుకోవాలన్నారు. శంకరాచార్యులు పలు స్తోత్రాలు, గ్రంథాలు, భాష్యాలు రచించారన్నారు. 35 రోజుల పాటు తాము నిర్వహించిన వేద పరిక్రమ యాత్రలో దేశంలోని పలు పవిత్ర స్థలాలను దర్శించుకోవడంతో పాటు పాకిస్థాన్ సరిహద్దు ప్రాంతాల్లో పర్యటించి హిందూ ధర్మాన్ని వ్యాప్తి చేయడంలో భాగంగా వేద పారాయణం, అనేక హోమాలు జరిపించినట్లు తెలిపారు. ముందుగా జ్యోతిష్య, న్యూమరాలజీ పండితులు డాక్టర్ నారాయణమూర్తి పట్నాయక్, పోలాప్రగడ సుబ్బారావు తదితరులు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాధవశర్మను ఘనంగా సత్కరించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

అక్కిరెడ్డిపాలెం: రోడ్డు దాటుతున్న ఓ మహిళను బైక్ ఢీ కొనడంతో తీవ్ర గాయాలపాలైన ఘటన పంతులు గారి మేడ ఎదుట శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. గాజువాక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పంతులుగారి మేడ వద్ద హై స్కూల్ రోడ్డులో నివాసం ఉంటున్న చిటికిరెడ్డి చినతల్లి (52) గాజువాక 80 అడుగుల రోడ్డులో గల షుగర్ క్యూట్ రెస్టారెంట్ అండ్ బేకరీలో హౌస్ కీపింగ్ పనులు చేస్తుంది. శుక్రవారం రాత్రి విధులు నిర్వర్తించిన అనంతరం ఇంటికి వస్తున్న క్రమంలో హైస్కూల్ రోడ్డు ఎదురుగా రోడ్డు దాటుతుండగా వేగంగా వస్తున్న ద్విచక్రవాహనం ఆమెను ఢీ కొట్టింది. ఈ ఘటనలో చినతల్లి ఎడమ కాలు పూర్తిగా నుజ్జయింది. తీవ్ర గాయాలపాలైన ఆమెను చికిత్స నిమిత్తం షీలానగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉందని గాజువాక పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు తెలియజేశారు.

నేత్రపర్వం.. నృసింహుని నిత్య కల్యాణం

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్యకల్యాణం శనివారం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై ఉదయం 9.30గంటలకు ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను కొలువుదీర్చి ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, ప్రసాదం, శేష వస్త్రాలను అందజేశారు.



కంకణధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

బదిలీపై వెళ్తున్న భెల్ అధికారికి సత్కారం



రాజును సత్కరిస్తున్న యూనియన్ నాయకులు

అక్కిరెడ్డిపాలెం: భెల్ (హెచ్‌పీవీపీ) యూనిట్ హెడ్ (హెచ్‌ఆర్) ఎంవీఎస్ఎన్ రాజు ఢిల్లీ కార్పొరేట్ కార్యాలయానికి బదిలీపై వెళ్తున్న సందర్భంగా గుర్తింపు యూనియన్ (ఏఐటీయూసీ) ప్రతినిధులు ఆయన్ను ఘనంగా సత్కరించారు. సంస్థ పరిపాలనా భవనంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో రాజుకు పుష్పగుచ్ఛాలను అందించి, అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో యూనియన్ ఉప గౌరవ అధ్యక్షుడు కొల్లి దేముడు, అధ్యక్షుడు బొండా బాబూరావు, ప్రధాన కార్యదర్శి సుభాకర్ సాహు, ప్రతినిధులు పాల్గొన్నారు.

సమ్మె పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అఖిలపక్షాల నాయకులు

ఉక్కునగరం: ఈ నెల 16వ తేదీన జరప తలపెట్టిన దేశవ్యాప్త పారిశ్రామిక సమ్మెను విజయవంతం చేయాలని అఖిలపక్షాల నాయకులు కోరారు. ఈ మేరకు సమ్మె పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. విశాఖ ఉక్కు కర్మాగారం అఖిల పక్షాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు కె.ఎస్.ఎన్.రావు, మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పారిశ్రామిక సమ్మె, భారత గ్రామీణ బంద్‌కు సంఘీభావంగా జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు విశాఖ ఉక్కులో నిర్వహించనున్న సమ్మెను విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో నాయకులు నీరుకొండ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

అగనంపూడి: దువ్వాడ రైల్వే స్టేషన్‌కు సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డారు. విజయవాడ నుంచి విశాఖ వైపు వెళ్లే ట్రాక్‌పై ఈ సంఘటన చోటు చేసుకుంది. దువ్వాడ జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. అగనంపూడి ఫ్లై ఓవర్ వంతెనకు సమీపంలో డొంకాడ కాలనీకి ఎదురుగా ఉన్న రైల్వే ట్రాక్‌పై సుమారు 35 సంవత్సరాల వయసు ఉన్న వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి, దువ్వాడ జీఆర్‌పీ ఔట్ పోస్ట్‌కు సమాచారం అందించారు. వెంటనే వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. తల, మొండెం వేరుగా ఉండడంతో ఆత్మహత్యకు పాల్పడినట్టు నిర్ధారించినట్టు తెలియజేశారు. శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి మృతి చెంది ఉంటారని తెలిపారు. మృతదేహంపై ఆకుపచ్చ రంగు టీ షర్ట్, నీలంరంగు ఫుల్ ట్రాక్ ఉంది. మృతుని వివరాల కోసం 9491782534 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

గాజువాక సమన్వయకర్త చందుకు భద్రత ఏర్పాటు

2ప్లస్2 సెక్యూరిటీ కల్పిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ



ప్రభుత్వం కల్పించిన భద్రతా సిబ్బంది నడుమ చందు

గాజువాక: వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు (చందు)కు ప్రభుత్వం భద్రత కల్పించింది. 70వ వార్డు కార్పొరేటర్‌గా ఉన్న చందును వైఎస్సార్‌సీపీ అధిష్టానం ఇటీవల గాజువాక సమన్వయకర్తగా నియమించింది. గాజువాక ఎమ్మెల్యేగా పోటీ చేయనుండడంతో చందుకు టూ ప్లస్ టూ భద్రత కల్పిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించడంతో ఈ మేరకువిశాఖ నగర కమిషనర్ సిబ్బందిని నియమించారు. ఈ సందర్భంగా చందు మాట్లాడుతూ తన భద్రత కోసం మొత్తం నలుగురు సిబ్బందిని నగర పోలీస్ కమిషనర్ కేటాయించారని, వీరు విధుల్లో చేరారని తెలిపారు.

విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి



బెలూన్లు ఎగురవేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్, వైఎస్సార్సీపీ గాజువాక ఇన్‌చార్జి చందు

అగనంపూడి: విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో ఆరోగ్యకరమైన పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి చందు అన్నారు. 85వ వార్డు అగనంపూడి సమీపంలోని ఏబీఎస్ పాఠశాల 18వ వార్షికోత్సవంలో వారు మాట్లాడారు. విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లల చదువుల పట్ల ఎంత శ్రద్ధ వహిస్తున్నారో, రాష్ట్ర ప్రభుత్వం కూడా అంతే శ్రద్ధ కనపరుస్తోందన్నారు. కార్యక్రమంలో పరవాడ ఎంఈవోలు ఎం.దివాకరరావు, గొంతిన సాయి శైలజ, కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సేవాదళ్ ప్రధాన కార్యదర్శి ఇల్లపు ప్రసాద్, పెందుర్తి వైఎస్సార్‌సీపీ యూత్ అధ్యక్షుడు కింతాడ ఈశ్వరరావు, గొన్నా హేమ్‌చంద్ నాయుడు, ఏబీఎస్ వ్యవస్థాపకులు పీ.ఎం.కొండయ్య, ప్రిన్సిపాల్ పద్మజ, డైరెక్టర్ దీపక్ తదితరులు పాల్గొన్నారు.

కట్టుకున్న చీరే యమపాశమై..

- మిషన్‌లో చిక్కుకున్న మహిళ చీర
- మిగిలిన భాగం మెడకు బిగుసుకుపోవడంతో ఊపిరాడక మృతి
- పరవాడ కర్రల యార్డులో ప్రమాదం



మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

పరవాడ : కట్టుకున్న చీరే యమపాశమై తనను అనంత లోకాలకు అర్ధంతరంగా తీసుకుపోతుందని ఆ మహిళ ఊహించలేకపోయింది. ఎప్పటిలాగే పని చేసుకుంటుండగా మిషన్‌లో చీర చిక్కుకోగా... మిగిలిన భాగం ఆ మహిళ మెడకు బిగుసుకుపోయి క్షణాల్లోనే ఊపిరాడక మృతి చెందింది. ఈ దుర్ఘటన మండలంలోని పరవాడ సినియా హాలు జంక్షన్‌లో ఏర్పాటు చేసిన కర్రల యార్డులో శనివారం సంభవించింది. ఈ ఘటనలో వెన్నెలపాలెం గ్రామానికి చెందిన వెన్నెల సూర్యనారాయణమ్మ (55) మృతి చెందింది. పరవాడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పరవాడ సినిమా హాల్ జంక్షన్‌లోని కర్రల యార్డులో సూర్యనారాయణమ్మ మూడేళ్లుగా రోజు కూలీగా పనిచేస్తోంది. శనివారం మధ్యాహ్నం యార్డులో తొక్క తీసే మిషన్‌కు కర్రలు అందిస్తుండగా ఆమె చీర మిషన్‌లో చిక్కుకుంది. కొద్దిసేపటిలోనే ఆ చీర మిగిలిన భాగం సూర్యనారాయణమ్మ మెడకు గట్టిగా బిగుసుకుపోవడంతో ఆమెకు ఊరిరాడక అక్కడికక్కడే మృతిచెందింది. మృతిరాలికి ఇద్దరు సంతానంతోపాటు భర్త ఉన్నారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు యార్డు వద్ద ఆందోళన చేశారు. మృతురాలి కుటుంబ సభ్యులకు నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. సమాచారం అందుకున్న పరవాడ ఎస్ఐ మల్లేశ్వరరావు ఘటనా స్థలికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. పరవాడ సీఐ ఎస్.బాలసూర్యారావు పర్యవేక్షణలో ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారన్నారు.